మొదటిరోజు నామినేషన్లు దాఖలు కాలేదు

అరకు ఆర్.ఓ, ఐ.టి.డి.ఏ.పి.ఓ. వి.అభిషేక్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనా మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదని అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సాధారణ ఎన్నికలకు 18వ తేదీన నోటిఫికేషన్ విడదలయ్యిందని చెప్పారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఐటీడీఏ కార్యాలయంలో ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేస్తూ అరకు అసెంబ్లీ నియోజక వర్గం నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ముందుగానే నామ పత్రాలు సక్రమంగా ఉండే విధంగా సరిచూసుకోవాలన్నారు. నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థితో పాటు నలుగురిని (1ప్లస్ 4) రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తామని చెప్పారు. దరావత్తు చెల్లించి ఎన్నికల అధికారికి నామపత్రాలు సమర్పించాలని స్పష్టం చేసారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు సమయపాలన పాటించాలని చెప్పారు.

మద్దిలబందలో జి.మాడుగుల సీఐ రమేష్ పర్యటన

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు: మండల పరిధిలోగల కుమడ పంచాయతీ పరిధిలో గల మద్దిలబంధ గ్రామంలో జి.మాడుగుల సర్కిల్ ఇన్ స్పెక్టర్ రమేష్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయించడం వలన పోలీసులకు చిక్కితే జైలు జీవితం అనుభవించ తప్పదని అన్నారు తమ పిల్లలను సంఘ విద్రోహశక్తుల వైపు గంజాయి సాగు వైపు వెళ్లనీయకుండా చదువు వైపు దృష్టి పెట్టేలా తల్లిదండ్రులే బాధ్యతగా తీసుకోవాలని ఆయన అన్నారు. పిలాలు చిన్నవయసులోనే నాటుసారా గుట్కాలు గంజాయి సేవించి దానికి బానిసులౌ ఆరోగ్యాలు పాడుచేసుకోట్టున్నారు. అలాంటి వ్యాసనలపై దూరంగా ఉండలనారు గంజాయి పండించిన, తరలించిన, విక్రయించిన నేరమని అటువంటి వారిపై కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె.రవీంద్ర, గిరిజనులు పాల్గొన్నారు.

మత్స్యగుండంలో నిఘా నేత్రం

విశాలాంధ్ర-హుకుంపేట : మన్యంతో ఎంతో ప్రసిద్ధి కలిగిన మత్స్యగుండంలో శ్రీమత్స్య లింగేశ్వర స్వామి ఆలయం వద్ద సీసీ కేమేరాలు ఏర్పాటు చేశారు. సమగ్ర గ్రామాభివృద్ధి సేవ సంఘం వారి ఆధ్వర్యంలో 8 కెమెరాలను మత్స్యగుండంలో ఏర్పాటు చేశారు. ఈ కెమేరాలను మత్స్యలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఆవరణాల్లో, మత్స్యగెడ్డ వద్ద మైదానంలో మత్స్యకన్యలు ఉండే సుడి గుండం వద్ద ఏర్పా టు చేశామని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అప్పారావునాయుడు తెలిపారు. మత్స్యగుండంల ఈ నిఘా ఏర్పాటుతో ఆలయం వద్ద ఇతరులు అనుమానస్పదంగా చంచరిస్తున్న, మత్స్యగెడ్డలో చెపల వేటకు వెళ్లిన తెలుస్తుందని తెలిపారు. ఈ కెమేరాల్లో రికార్డులను సంఘ సభ్యులు, గ్రామ కమిటీ యువత తమ సెల్ ఫోన్లో చూడవచ్చాని తెలిపారు. సీసీ కెమేరాల మూలంగా మత్స్యగెడ్డలో మత్స్య దేవతలను, ఆలయ పరిశారలను కాపాగుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రపంచ వారసత్వ దినోత్సవం

విశాలాంధ్ర-అరకులోయ : మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగపు ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె భరత్ నాయక్ ఆదేశాల మేరకు ప్రపంచ వారసత్వ దినోత్సవంను గురువారము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకరాలు వై విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మన దేశ వారసత్వ సంపద గురించి అవగాహన కలిగి చారిత్రాత్మక సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. అదేవిధంగా చరిత్ర విభాగం ఇంచార్జి పి నాగబాబు మాట్లాడుతూ చారిత్రాత్మక కట్టడాలు ఎన్నో ఉన్నాయని విద్యార్థులు వాటి మీద అవగాహన ఏర్పరచుకొని వాటిని భవిష్యత్ తరాలకు అందజేసే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురు అరెస్టు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా , రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వర రెడ్డి చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్ర కుమార్ ఆదేశాలతో డొంకరాయి ఎస్సై శివ కుమార్, తన సిబ్బందితో వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని డొంకరాయి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్ పోస్ట్ వద్ద వై రామవరం డిప్యూటీ తహశీల్దార్ సుధాకర రావు, వి ఆర్ ఓ సందీపాచార్యులు ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకూ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎన్టీఆర్ జిల్లా కంచకచర్ల కి చెందిన పెనుమల బాబూ, పర్వతం సురేష్ లు సుజికి ఆక్సెస్ బైక్ పై సీలేరు వైపు నుండి డొంకరాయి వైపుకు వస్తుండగా డొంకరాయి పోలీస్ స్టేషన్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా సుజికీ యాక్సెస్ బైక్ డిక్కిలో రెండు కేజీలు ఉండటంతో, 10వేల రూపాయల విలువైన 2కేజీల గంజాయి, సుజికి యాక్సెస్ బైక్ లను సీజ్ చేసి ఇద్దరు ముద్దాయిలు బాబు, సురేష్ లను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. మరో కేసులో మంగంపాడు వెట్కపు నుండి డొంకరాయి వైపుకి వస్తున్న ఆటోలో 3 ప్లాస్టిక్ బ్యాగ్ ల్లో 60 కేజీల గంజయి అక్రమంగా తరలిస్తున్న బర్రిగూడ గ్రామానికి చెందిన కిలో రాందాస్, తెలంగాణ రాష్ట్రం చిట్యాలకి చెందిన గోగ్రే కృష్ణ లను అరెస్టు చేసి కేసు నమోదు చేసి, 3.30లక్షల రూపాయల విలువైన 60 కేజీల గంజాయిని , ఆటోలను సీజ్ చేసి ఇద్దరు ముద్దాయిలు రాందాస్, కృష్ణలను రిమాండ్‌కి తరలించారు. ఈ రెండు కేసుల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం సేకరించడంలో ముద్దాయిలు చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన ఎస్ఐ శివకుమార్‌ను, హెడ్ కానిస్టేబుల్స్ కళ్యాణ్, ఐ శ్రీనివాసరావు, ఆర్ శ్రీనివాస్ గౌడ్, కానిస్టేబుల్స్ పోసయ్య, గంగరాజులను, సీఐ గజేంద్ర కుమార్ , చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

గ్రామాల్లో దోమల మందు పిచికారీ

విశాలాంధ్ర-జీకే.వీధి: జిల్లా అధికారుల ఆదేశాలమేరకు మండలంలోని వైద్యధికారులు, సబ్ యూనిట్ అధికారి ఆర్,కన్నబాబు, ఆధ్వర్యంలో, రింతాడ సచివాలయం 1, ఇంద్ర నగర్ గ్రామం లో దోమల మందు పిచికారి పనులు,ప్రారంభించడం జరిగినది, ప్రతి ఇంటి లోపల, బయట, ఏసియమ్ ఐదు శాతం దోమల మందు పిచికారి చేసారు. మందు కొట్టిన గోడలను మట్టితోగాని, పేడతో గాని, అలుకరాదని ఈ సందర్భంగా ప్రజలకు ఆయా శాఖల సిబ్బంది చెప్పారు. ఈమందు ప్రభావం కనీసం 45 రోజులవరకు వుంటుందని, మందు పిచికారి చేయడం వలన, మలేరియా, డెంగ్యూ, జ్వరాలు, కొంతవరకు, రాకుండా నివారించవచ్చునన్నారు. అలాగే గ్రామంలో ప్రజలందరూ దోమ తెరలు వాడాలని సూచించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్ర వారం, డ్రై డే పాటించి, ఇంటిలో ఉన్న అన్ని పాత్రలు శుభ్రం చేసుకోవాలి, ఎండాకాలం బయటకు వెళితే, గొడుగుగాని, టోపిగాని ధరించడం మంచిదన్నారు. అత్యవసర పనులు ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం ,చేసుకోవాలని, గ్రామాలలో ఉపాధి పనులకు వెళ్ళే వారు, ఉదయం 6 గంటల నుండి 9 గంటల లోపు ముగించుకోవాలన్నారు. ఎక్కువగా మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్ల తాగాలి, వేసవి లో, కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ఇలా చేయడం వలన వడదెబ్బకు, గురి కాకుండా వుండవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో, సబ్ యూనిట్ అధికారి, ఆర్.కన్నబాబు, హెల్త్ అసిస్టెంట్ ఎం సత్య నారాయణ, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్, శ్రావణి, ఆశ పి శ్రీదేవి పాల్గొనడం జరిగింది.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొంది యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

సిఆర్పిఎఫ్ 234/బి బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత

విశాలాంధ్ర-చింతపల్లి : కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ (సిఆర్పిఎఫ్) దత్తత గ్రామమైన కూర్మన్నపాలెం కి చెందిన గిరిజన యువతకు తమ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నం లో మూడు మాసాలపాటు అందించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ తో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు ఉద్యోగ అవకాశాలు రావడం తమకంతో సంతృప్తిని కలిగించిందని సిఆర్పిఎఫ్ 234 బెటాలియన్ బి కంపెనీకి చెందిన అసిస్టెంట్ కమాండెంట్ వినీత అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రజారక్షణలో పోలీసు వ్యవస్థ పాత్ర కీలకం అన్నారు. అటువంటి పోలీసు వ్యవస్థలో సిఆర్పిఎఫ్ మరో అడుగు ముందుకు వేసి అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్న గిరి గ్రామాలను దత్తత తీసుకోవడంతో పాటు ఆ గ్రామాల అభివృద్ధి, ఆ గ్రామంలో ఉన్న ప్రజల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా యువత సన్మార్గంలో పయనించేలా వారి భవిష్యత్తును బంగారు బాట చేసుకునేలా సిఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఇప్పించడం జరుగుతుందని అందులో భాగంగానే కూర్మన్నపాలెం గ్రామంలోని యువకులు మూడు నెలల పాటు విశాఖపట్నంలో శిక్షణ పొందారన్నారు. వారిలో ముగ్గురు ప్రస్తుతం ఉద్యోగాలు చేసుకుని ఉపాధి పొందుతున్నారన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన వారు కూడా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థులు రెండవ జాబితా విడుదల

భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : భారత్ ఆదివాసీ పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల రెండవ జాబితాను విడుదల చేయడం జరిగిందని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. తమ పార్టీ జాతీయ అధ్యక్షుని ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి డాక్టర్ గోకురుబోయిన సీతరత్నం, మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గానికి మండంగి పోలిరాజు లను అభ్యర్థులుగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో తమ పార్టీ తరపున అభ్యర్థులను బరిలో నిలపడం జరుగుతుందని గిరిజన చట్టాలు హక్కుల రక్షణకై తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు డాక్టర్ పి రామకృష్ణ, రాష్ట్ర కోశాధికారి మర్రిచెట్టు పోతురాజు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ లువ్వాసింగి, ఎంపీటీసీ గబ్బాడి పర్యటన

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలం పెదలువ్వాసింగి పంచాయితీ పరిధిలోగల వలసమామిడి బొండపల్లి తరబసింగి వసబంద కందులుగదే గ్రామాలకు వచ్చే నెల 13వ తేదిన జరగబోయే సార్వతిక ఎన్నికల్లో భాగంగా వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర పర్యటించారు. ఈ సందర్భంగా 5 గ్రామాల ప్రజలకు మన ఎమ్మెల్యే అభ్యర్థి మత్యారాస విశ్వేశ్వరాజుకి ఎంపి అభ్యర్థి శెట్టి తనూజరాణిని ఇద్దరిని కూడ ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని 5 గ్రామాల ప్రజలకు కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సచివాలయం కన్వీనర్ గబ్బాడి పందు దొర సచివాలయం కన్వీనర్ వండలం రమణబాబు సీనియర్ నాయకులు ఉలంగి కర్రిపడాల్ సుకూరు నీలకంఠం వార్డు మెంబర్ కోరాబు ప్రదీప్ పడాల్ గృహ సారధి వంతల సుబ్బారావు వివిధ గ్రామాల ప్రజలు పాల్గున్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ టీచర్ మృతి

విశాలాంధ్ర -సీలేరు.... జీకేవీధి మండలం దారకొండ ఏనుగుబైలు గ్రామానికి అంగన్వాడీ టీచర్ గొరగలి కృష్ణవేణి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. గత రెండు నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతుంది. ఈమేరకు చింతపల్లి ఆసుపత్రి లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణవేణి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కల్వర్టును ఢీకొన్న జీపు... ఒకరు మృతి, పదిమందికి గాయాలు

విశాలాంధ్ర- కురుపాం : మండలంలోని రస్తాకుంటుబాయి మలుపు వద్ద జీపు అదుపు తప్పి కల్వర్టుకు ఢీ కొనడంతో ఒక మహిళ అక్కడికక్కడ మృతి చెందగా 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి భ ద్రగిరి, కురుపాం సామాజీక ఆరోగ్య కేంద్రంలో 108 ద్వారా చేర్పించి చికిత్స అందించారు. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలంలో గల పి.లేవిడి, కాకితాడ గ్రామాలు నుండి కొమరాడ మండలం పూడేసు శుభకార్యానికి గురువారం మధ్యాహ్నం జీపులో వెళ్తుండగా రస్తాకుంటుబాయి వద్ద జీపు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టుకు ఢీ కొనండంతో జీపులో ప్రయాణిస్తున్న పి.లేవిడికి గ్రామానికి చెందిన కిమిడి కమలమ్మ (55) అక్కడికక్కడు మృతి చెందిగా పలువురుకి గాయాలు అయ్యాయి. వీరిలో గాయపడిన పి. లేవిడ కి చెందిన బొమ్మన సుగుణ, పెద్దింటి బుజంగరావు, సుజాత, పాలక శశిరేక, నిమ్మక సుమన్, కాకితాడకు చెందిన గంటా పవన్, నేమలపురి తేజకు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం

తరలించగా డాక్టర్ శోభరాణి, సిబ్బంది వైద్య ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అలాగే గాయపడిన సుగుణ, చైతన్య, శశిరేఖను భద్రగిరి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన వ్యయ పరిశీలకులు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికలు అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్ ను నాలుగు శాసనసభల నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ గురువారం సందర్శించారు. జిల్లాకు చేరుకున్న వ్యయపరిశీలకులు కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఎన్నికల ప్రవర్తన నియమావళి విభాగం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా విభాగం, వ్యయ విభాగం, పిర్యాదులు విభాగం, చెక్ పోస్టుల పర్యవేక్షణ నియంత్రణ విభాగం, జియో టాగింగ్ వాహనాల పర్యవేక్షణ విభాగం తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పార్వతీపురం, కురుపాం శాసన సభ నియోజకవర్గాలలో పర్యటించి పరిశీలించారు.జాయింట్ కలెక్టర్ మరియు అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ ఎస్ శోభిక కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును ఆయనకు వివరించారు. అంతకముందు జిల్లా కలెక్టర్ చాంబార్లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిశాంత్ కుమార్ ను కలుసుకున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవనాయుడు, కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారి మరియు ఎస్డిసి ఆర్ వి సూర్యనారాయణ, ఎంసీసీ నోడల్ అధికారి ఎం డి గయాజుద్దీన్, సోషల్ మీడియా నోడల్ అధికారి యు సాయికుమార్, ఎంసిఎంసి నోడల్ అధికారి లోచర్ల రమేష్, సహాయ వ్యయ పరిశీలకులు ఆర్ వి రమణమూర్తి, పర్యవేక్షకులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బెలగాం : రైలు నుండి జారిపడి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మునిసిపల్ టౌన్ రైల్వే స్టేషన్ రైలు గేటు సమీపంలో ఉంటున్న ఏటూరి లక్ష్మణరావు (54) పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ నుండి విజయనగరం వెళ్లడానికి దుర్గ నుండి విశాఖపట్నం వెళ్తున్న ఎక్స్ ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ వచ్చేసరికి అదే ట్రైన్ లో నుండి జారి క్రిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పార్వతీపురం రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబీకులకు అందచేశారు. పార్వతీపురం జిఆర్పి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలలో మొదటి కుమార్తెకు పెళ్లయి ఇద్దరు పిల్లలు, తాడేపల్లిగూడెంలో పిజి చేస్తున్న రెండవ కుమార్తె ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా నిమ్మక జయరాజు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-కురుపాం : ఎమ్మెల్యే అభ్యర్థిల నామినేషన్లు సమర్పణ తొలిరోజు మాజీ ఎమ్మెల్యే , ఆదివాసీ జెఎసి చైర్మన్ నిమ్మక జయరాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వివి రమణకు అందజేశారు. నామినేషన్ దరఖాస్తు పూర్తి పరిశీలన అనంతరం ఆమోదించారు.అనంతరం స్వతంత్ర అభ్యర్థి నిమ్మక జయరాజు మాట్లాడుతూ సుమారు పదేళ్ల కాలం బిజెపి తో కలిసి పనిచేశానని బిజెపి, జనసేన, తెలుగుదేశం పార్టీ కూటమిలో భాగంగా కురుపాం టికెట్ బిజెపి తరపున జయరాజుకే వస్తుందని అందరూ తనతోపాటు విశ్వసించామని కానీ తన కోడలిని మూడోసారి ఎమ్మెల్యేగా చేసేందుకు మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆడిన నాటకంలో తనకు టికెట్ రాకుండా పోయిందని, జగదీశ్వరికి కూడా నష్టం జరిగితీరుతుందని అన్నారు.ఎంపీగా కొత్త పిల్లి గీత అభ్యర్థిత్వంను అరకు పార్లమెంటు పరిధిలోని గిరిజనులు వ్యతిరేకిస్తూ ఉంటే రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి గీతకు సిఫార్సు చేయడం ద్వారా ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేసే అవకాశం లేకపోవడంతో స్వతంత్ర ఎమ్మెల్యే, ఎంపీ నామినేషన్లు దాఖలు చేయనున్నామని తెలిపారు.నియోజకవర్గంలో ప్రజలు ఎవరు వలన అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నారో వారికీ ఓట్లు వేసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను అన్నారు. భారతీయ జనతా పార్టీలో కొందరు వ్యక్తులు వలన జరిగిన ఇబ్బందులు తప్ప తాను బిజేపి కి వ్యతిరేకంగా లేనని కేంద్రం లో మళ్ళీ బిజెపి వస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని తాను బలంగా నమ్ముతున్న అన్నారు. శుక్రవారం పార్వతీ పురంలో ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ప్రకటించారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

విశాలాంధ్ర-సాలూరు రూరల్ : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. 18 వ తేది ఉదయం 11 గంటల నుండి 25 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు స్థానిక తహశీల్దారు కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుంది. ఇందులో భాగంగా తొలిరోజు అయిన గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ తెలిపారు. ప్రధాన పార్టీల నామినేషన్‌కు నేడే మహుర్తం అధికార,ప్రతిపక్ష పార్టీల సభ్యులు ముహూర్తం ప్రకారం నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు.డిప్యూటీ సిఎం రాజన్నదొర ఉదయం 11 గంటలకు మహూర్తం మేరకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తారు.ఆ తరువాత ఈనెల 24వ తేదీన అనుచరులు, కార్యకర్తలతో కలసి భారీ ఊరేగింపుగా మరొకమారు నామినేషన్ దాఖలు చేస్తారు. అదేవిధంగా కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కూడా 19 వ తేదీన మహూర్తం ప్రకారం నామినేషన్ దాఖలు చేస్తారు.ఆమెకూడా ఈనెల 24 వతేదీన కార్యకర్తలు,తెదేపా శ్రేణులతో కలసి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పటిష్ఠ బందోబస్తు.... నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలైన నేపధ్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.డిఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో వాసునాయుడు, బాలకృష్ణ, నారాయణరావు సిఐ ల నేతృత్వంలో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయానికి 500 మీ టర్ల దూరం వరకు ఉన్న దుకాణాలను 11 నుండి 3 గంటల వరకు ఈ నెల 25వ తేదీ వరకు మూసివేయాలని యజమానులకు ఆదేశించారు.

వైసీపీ నేతలు టిడిపిలో చేరిక

విశాలాంధ్ర-బెలగాం : పలువురు వైసీపీ నాయకులు గురువారం తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల పార్వతీపురం నియోజకవర్గ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర సమక్షంలో టిడిపిలో చేరారు. వారిలో పార్వతీపురం మునిసిపల్ 18వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు, పార్వతీపురం తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గొట్టా శివకేశ్వరరావు, మరో సీనియర్ వైసిపి నాయకులు చనమల శ్రీనివాస్ (వాసు) వైసీపీని వీడి టిడిపి కండువా వేసుకున్నారు. వారిని విజయ్ చంద్ర టిడిపి పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఇప్పటికే చాలా మంది టిడిపిలోకి చేరారని, ఇక పెద్ద ఎత్తులు వలస వస్తారని అన్నారు. తెలుగుదేశం నాయకులు డా. చీకటి బదరీ నారాయణ, చీకటి సింగ్ ఆధ్వర్యంలో 18వ వార్డుకు చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర అధ్యక్షతన తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మంచుపల్లి సత్యనారాయణ, మజ్జి కృష్ణమోహన్, మజ్జి వెంకటేష్, మునిసిపల్ కౌన్సిలర్లు కొరాద నారాయణరావు, తాతపూడి వెంకటరమణ, గుంట్రెడ్డి రవికుమార్, సారిక క్రిష్ణంనాయుడు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఐటీడీఏలో 144 సెక్షన్ : డీఎస్పీ జివి కృష్ణారావు

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏ కార్యాలయం ఆవరణలో ఈనెల 18 నుండి 25వ తేదీ వరకు సాధారణ ఎన్నికల నామినేషన్ స్వీకరణ లో భాగంగా ఐటీడీఏ అదవితల్లి విగ్రహం మెయిన్ గేట్ నుండి వెలుపల ప్రాంతం అంత 144 సెక్షన్ అమలు చేయడం జరిగిందని పాలకొండ డిఎస్పి జీవీ కృష్ణారావు తెలిపారు. గురువారం తమ సిబ్బందితో ఐటీడీఏలో అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమతి లేని వాహనాలు వెలుపలకు రాకుండా బార్కేడులు ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మహేశ్వరరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, సీతంపేట సబ్ ఇన్స్పెక్టర్ జగదీష్ నాయుడు, దోనుబాయి ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

18వ తేదీన ఐటీడీఏలో నామినేషన్లు నమోదు శూన్యం

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏలో 18వ తేదీన ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని పాలకొండ నియోకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి తెలిపారు. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, ఈనెల 25 వరకు నామినేషన్లు వేసుకోవచ్చని తెలిపారు. ఐటిడిఏ ప్రాంగణంలో 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని అందుకు సంబంధించి పోలీస్ సిబ్బంది పలు సూచన చేయడం జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. 18వ తేదీన నామినేషన్లు నమోదు కాబడలేదని పాలకొండ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి తెలిపారు. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, ఈనెల 25 వరకు నామినేషన్లు వేసుకోవచ్చని తెలిపారు.

ఎన్నికల వ్యయ పరిశీలకులు సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లా పార్లమెంటరీ వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిన గుర్ కరణ్ సింగ్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉద్యానవన కళాశాల అతిథిగృహంలో గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంటరీ వ్యయ పరిశీలకులుగా నియమించబడి గురువారం జిల్లాకు చేరుకున్న సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ప్రశాంతంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలను కలెక్టర్, జిల్లా ఎస్పీలు ఆయనకు వివరించారు.

అన్న సమారాధన కార్యక్రమానికి విశేష స్పందన

వందలాదిగా తరలివచ్చిన భక్తులు

విశాలాంధ్ర-చింతపల్లి : శ్రీరామనవమిని పురస్కరించుకొని స్థానిక రామాలయం వద్ద గురువారం అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రామాలయం వద్ద బుధవారం సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించిన భక్తులు గురువారం అన్న సమారాధన కార్యక్రమాన్ని కూడా అదే స్థాయిలో నిర్వహించారు. ఈ అన్న సమారాధన వందలాది మంది భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించడంతోపాటు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ సీతారాముల కళ్యాణం కమనీయంగా జరిగిందని ప్రతి ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన గ్రామంలో ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండేందుకు ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

మన్యంలో హోరెత్తిన కూటమి అభ్యర్థుల ప్రచారం

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గ ఉమ్మడి పార్టీ అభ్యర్థి తోయక జగదీశ్వరి ఎన్నికల ప్రచారం హెూరెత్తింది. అరకు పార్లమెంట్ పరిధిలోని కురుపాం నియోజకవర్గంలో ఎంఎల్ఏ అభ్యర్థి ప్రచారమునకు వ కూటమి నాయకులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత హాజరయ్యారు. గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడి వద్ద నుండి రోడ్ షో ద్వారాలో ప్రచార రథం నుండి అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, కురుపాం నియోజకవర్గ కూటమి అభ్యర్థి తొయక జగదీశ్వరి ఎన్నికల ప్రచార యాత్రలో ఐదు మండలాల తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గీత మాట్లాడుతూ రాష్ట్రంలో గుంతలు రోడ్డుల పై ప్రజలు పయనించలేని దుస్థితి ఏర్పడింది అన్నారు. జాతీయ రహదారులన్ని మోడి దయవల్లే బాగున్నాయని అన్నారు. ఉప ముఖ్యమంత్రిగా వున్న పుష్ప శ్రీవాణి ఎటువంటి అభివృద్ధి చేయలేదని గీత విమర్శించారు. కేవలం వీళ్ళు పవన్ కళ్యాణ్, చంద్రబాబు లను విమర్శలు చేయడానికే బయిటకు వస్తారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమని, రహదారులపై గుంతలు పడి ఉన్నాయని చదువుతున్న పిల్లల్ని రాష్ట్ర రాజధాని కోసం అడిగితే మొండం లేని తలకాయలా వొదిలేయడంతో మూడు ముక్కల ఆటగా మార్చారన్నారు. అధికార వికేంద్రీకరణ అంటే ముఖ్యమంత్రి, మంత్రులు కలెక్టర్లు సమన్వయం తో పని చెయ్యాలి కాని వికేంద్రీకరణ పేరుతో అభివృద్ధి కుంటు పర్చారన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అయిన పుష్ప శ్రీ వాణీకీ, రాజన్న దొరకు అధికారం ఏమైనా ఉందా అని గీత ప్రశ్నించారు. చంద్రబాబు

నాయుడు, పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయడానికి మాత్రమే మంత్రులు బయటకు వస్తారన్నారు. నీటి పారుదల శాఖామంత్రి అంబటి రాంబాబు బూతులు మాట్లాడే మంత్రిగా అందరికీ తెలుసునని, అంతే కాని ఇక్కడున్న రిజర్వాయర్ ల పరిస్థితులు పై అవగాహన లేదన్నారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ఎన్నో కష్టాలను ఓర్చి రాష్ట్ర ప్రజల భాగు కోసం శ్రమిస్తున్నారనీ, ప్రధాని మోది ప్రపంచంలోనే ఒక విశ్వ గురువుగా దేశాన్ని నిలిపారన్నారు.

శ్రీలక్ష్మినరసింహస్వామి ముడుపుల పూజలకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తజనం

విశాలాంధ్ర-సీతానగరం : మండలకేంద్రంలో సువర్ణముఖి నదిఒడ్డున ఉన్న శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో గురువారంనాడు జరిగిన ముడుపుల పూజలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ప్రతీ గురువారం జరుగుతున్న ముడుపుల పూజలకు వేకువ జామునుండి రాత్రి వరకు జరుగు తున్న పూజలో పాల్గొన్న భక్తజనం ఓంనమో శ్రీలక్ష్మినరసింహస్వామి, ఓంనమోనారాయణాయ, ఓంనమో శ్రీవేణుగోపాలస్వామియేనమ జైశ్రీమన్నారాయణ అంటూ 27సార్లు ప్రదక్షిణలుచేస్తూ దర్శించుకున్నారు.ప్రతీ గురువారంనాడు ఆలయఅర్చకులు వీనపాటిశ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, కృష్ణామాచార్యులు, మురారీ తదితర అర్చకులు ముడుపుల పూజలను దగ్గరుండి చేయిస్తున్నారు. స్వామివారిని రకరకాల పూలతో చేసిన అలంకరణ కూడా భక్తులను ఆకట్టుకుంటుంది. ప్రతీగురువారం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి నరసింహస్వామీ ముడుపులపూజలకు దూరప్రాంతాలనుండి కూడా పెద్దఎత్తున వాహనాలతో భక్తజనంవిచ్చేసి ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఇదిలాఉండగా ఈనెల 21నుండి 24వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలో ఏకాదశివార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీరాముడు బస చేసిన ఇంజరంలో ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు

విశాలాంధ్ర-చింతూరు : చట్టికి 12కిలో మీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామం ఇంజరం (చతిస్గఢ్ రాష్ట్రం)లో శ్రీ రామ నవమి ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు.

ఇంజరం పేరు ఎలా వచ్చింది : 14 సంవత్సరాలు వనవాసం సమయములో శబరి ఒడ్డున స్నానం ఆచరించి ఇంజరం లో ఒక్క రోజు ఉండి భద్రాచలం వైపు పయనించడం జరిగిందనీ, శ్రీరాముడు బస చేసిన స్థానం లో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, దుర్గమ్మ తల్లి,విఘ్నేశ్వరుడు, సప్త ఋషులు, శ్రీరాముడు సీతమ్మ తల్లి, నంది, శ్రీ రాముడు పాద చిన్హాలు ఉన్నాయి .అవి 11 వ శతాబ్దం నాటివి అని వినకడి. శ్రీరాముడు భద్రాచలం వైపు పయనించిన తర్వాత అక్కడ

గిరిజన ప్రజలు వచ్చి గ్రామ పూజారిని అడిగారని దానికి ఆ పూజారి 'ఇంజెరామ్ వత్తోండ' అని చెప్పడం జరిగింది. దాని కారణంగానే ఆ గ్రామం పేరు ఆ నాటి నుండి 'ఇంజరం' అని పిలవడం జరుగుతోంది అని అక్కడి గ్రామ్ పెద్దలు పూజారి, పటేల్, ఊరి ప్రజలు చెప్తున్నారు. అయోధ్య రామ్ మందిర్ నిర్మాణం తర్వాత ఇంజరం గ్రామంలో ప్రథమ సంవత్సరం శ్రీరామ నవమి ఉత్సవాలు భద్రాచలంలో జరిగే విధంగా అదే సమయానికి ఇంజరం లో కూడా శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం ఘనంగా జరిగాయి. సీతారామచంద్ర స్వామి వారి ఊరేగింపు పల్లకి సేవా, శ్రీ సీతారామ చంద్ర స్వామివారి కళ్యాణ మహెూత్సవంలో గిరిజనగ్రామ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు, అనంతరం మహా అన్నదానం కార్యక్రమం చేశారు. అన్నదానానికి వేలాది మంది భక్తులు తీర్థ అన్న ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమ%శీ%లో గ్రామం పూజారి, పటేల, సల్వం రాజారాం, పి గోపాల్ నాయుడు, పి సుబ్బారావు సాయి శ్రీను, గ్రామ పెద్దలు యువతి యువకులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి సబ్ పోస్ట్ ఆఫీసులో ఏర్పాటుచేసిన ఆధార్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం డివిజన్ పోస్టల్ అధికారి తాతు నాయుడు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల రెండో తేదీన స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సెంటర్ ప్రారంభించమని తెలిపారు. ఈ ఆధార్ సెంటర్లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని, కావున మారేడుమిల్లి, మండలంతో పాటు వై.రామవరం ఎగువ ప్రాంత ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఐపివో తాతునాయుడు కోరారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : ఇండియా కూటమి బలపరిచిన రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స లను గెలిపించుకుని ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని రాజవొమ్మంగి మండల కాంగ్రెస్ నేతలు పిలుపు ఇచ్చారు. గురువారం ఉదయం మండల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎస్.కె.ఎం. మహబూబ్ అలీ, ప్రధాన కార్యదర్శి, ఓబిసి డిపార్ట్మెంట్ స్టేట్ కోఆర్డినేటర్ సవరపు సతీష్ లు సిపిఎం నేతలు కోండ్ల సూరిబాబు, సింగిరెడ్డి అచ్చారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ ఏజెన్సీ లో ఇప్పుడున్న పరిస్థితుల్లో లోతా రామారావు వంటి ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవలసిన అవసరం చాలా ఉందన్నారు. ఏజెన్సీ ముద్దుబిడ్డ లోతా రామారావు గెలిస్తే ఏజెన్సీ సమస్యలు పరిష్కరించుకునే అవకాశం, హక్కులు కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. గిరిజనులే కాకుండా బడుగు బలహీన వర్గాల ప్రజలంతా లోతా రామారావును గెలిపించడానికి కృషి చేయాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా సతీష్ మాట్లాడుతూ ట్రైబ్ నాన్ ట్రైబ్ అనే తేడా లేకుండా ఏజెన్సీ లో ప్రస్తుతం అందరూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోతా రామారావు గెలిస్తే సమస్యలు పరిష్కారానికి చక్కని అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ప్రజలంతా ఇండియా కూటమి సిపిఎం అభ్యర్థి లోతా రామారావు ను గెలిపించాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం మండల నాయకులు కోండ్ల సూరిబాబు, సింగిరెడ్డి అచ్చారావు లు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఏజెన్సీ సమగ్ర అభివృద్ధికి, నీతి నిజాయితీ పనిచేసే సిపిఎం అభ్యర్థులకు 'సుత్తి కొడవలి నక్షత్రం' గుర్తు కి ఓటు వెయ్యాలని కోరుతున్నామన్నారు.

నాలుగు నెలలుగా బియ్యం రాక వృద్ధుల ఎదురుచూపులు

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : మండల పరిధిలోని వడ్డిగూడెం గ్రామ సచివాలయం పరిధిలోని వడ్డీ గూడెంగ్రామానికి చెందిన ఆకులు రాఘవలకు గత నాలుగు నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వటం లేదు. పాపం వృద్ధుడు ఏమిటా అని బియ్యం ఇచ్చే వారిని అడిగితే తాత మీ కార్డు ఆన్లైన్‌లో కనబడట లేదని చెప్పారు. అక్కడ నుండి సచివాలయంకు వెళితే తాత నువ్వు యం.ఆర్.ఓ. దగ్గరకు వెళ్ళు అని చెప్పారు. అక్కడకు వెళితే సచివాలయంలో కనుక్కోండి అని రెవెన్యూ వారు చెప్పారు. అప్పటి ఎమ్మార్వో ఈ వృద్ధుల బాధ చూడలేక అక్కడికక్కడే 15 కె.జి.ల బియ్యం ఇచ్చారు. ఆ తర్వాత ఎన్నిసార్లు తిరిగినా ఫలితం శూన్యం. ఇక్కడ చెప్పుకోవాల్సిందే ఏమిటంటే ఈ వృద్ధుల సంబంధించిన వాలింటర్ ఎన్నోసార్లు రెవెన్యూశాఖ వారి చుట్టూ ప్రదక్షిణలు చేసాడు. అయినా దిక్కు లేదు. సంబంధించిన అధికారులను సంప్రదించిన ఒకరి మీద ఒకరు చెప్పుకోవడమే తప్ప ఫలితం శూన్యం. ఇంటి ఇంటికి బియ్యాన్ని ఇస్తున్నామని చెప్పుకునే వారు. ముసలివారి సమస్య తీర్చలేదు. గత నాలుగు నెలలుగా బియ్యం రాక ఇబ్బందులు పడుతున్నా వృద్ధ దంపతులకు సహాయం చేయదగిన వారు ఎవరు లేరా..? వృద్ధులు ఎన్నిసార్లు తిరిగిన ఫలితం లేదు. స్థానిక

సిబ్బందిని కనుక్కుంటే ఈయన కార్డు నెంబరు ఆన్లైన్లో కనిపించట్లేదని చెపుతున్నారు. ఈ తప్పు ఎవరిది? వృద్ధులదా? సంబంధించిన అధికారులను ఈ విషయమై అడగగా వారు సాంకేతిక లోపం కారణంగా వృద్ధుల కార్డు ఆన్లైన్లో కనిపించలేదని కనుక వారి పేరుతో కొత్త కార్డుకు దరఖాస్తు చేశామని ఈ.కే. వై.సి. కూడా చేశామని ఎలక్షన్ కోడ్ వల్ల వెబ్సైట్లు ఓపెన్ కావడం లేదని వెబ్సైట్ ఓపెన్ కాగానే కొత్త కార్డు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై సి.పి.ఐ. మండల కార్యదర్శి కర్నాటి రాంబాబు(ఏసు) మాట్లాడుతూ ఇప్పుడంటే ఎలక్షన్ కోడ్ వచ్చిందని గత నాలుగు నెలల క్రితమే వృద్ధుల కార్డు మీద బియ్యం ఇవ్వడం లేదని అప్పుడే ముసలివారి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే నాలుగు నెలలుగా ముసలివారి బియ్యం లేక ఇబ్బందులు పడేవారు కాదని ఇప్పుడు ఎలక్షన్ కోడ్ వల్ల వెబ్సైట్ ఓపెన్ కావడం లేదని చెప్పడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. ఎలక్షన్ అయ్యేవరకు ముసలివారికి ఈ అగచాట్లు తప్పవా అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మండల రెవెన్యూ ఆఫీసర్ స్పందించి ఈ వృద్ధుల సమస్య పరిష్కారం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ మద్దతు కోరిన ఇండియా కూటమి అభ్యర్థి

విశాలాంధ్ర-అడ్డతీగల : రంపచోడవరం నియోజకవర్గం ఇండియా కూటమి అభ్యర్థి లోతా రామారావు అడ్డతీగల లో కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిసి మద్దతు కోరడం జరిగింది. ప్రజా అకాంక్ష లకు అనుగుణంగా మన్యంలో గిరిజనాభివృద్ధికి వైసిపీ ప్రభుత్వం చేసిందేమి లేదని తనని గెలిపించటం వలన దళిత గిరిజన అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. పిసిసి రాష్ట్ర కార్యదర్శి దంగేటి సత్తిబాబు, కొందరు ముఖ్య కాంగ్రెస్ నాయకులను కలవడం జరిగింది . ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఏవి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఎం రాజశేఖర్, సిపిఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. లోతా రామారావు ఇండియా కూటమి నుండి తనకు మద్దతు పలకాలని కోరడం జరిగింది.

తొలి రోజు రెండు నామినేషనులు దాఖలు

విశాలాంధ్ర-రంపచోడవరం : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటిరోజు రెండు నామినేషన్స్ రావడం జరిగిందని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ సమావేశపు హాలులో 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒక్కొక్క నామినేషన్ పత్రం దాఖలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మొదటి రోజు మొదటి నామినేషన్ పాలడుగు లక్ష్మీ ప్రసన్న తండ్రి పాలడుగు శ్రీ వెంకటేశ్వరరావు రంపచోడవరం మండలము సిరిగిందలపాడు గ్రామానికి చెందిన వారు ఒక సెట్టు నామినేషన్‌పత్రం ఇండిపెండెంట్గా దరఖాస్తు సమర్పించారు. అదేవిధంగా రెండవ నామినేషన్ పాలడుగు శ్రీ వెంకటేశ్వరరావు, తండ్రి భాస్కరరావు రంపచోడవరం మండలం, సిరిగిందెల పాడు గ్రామానికి చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి దరఖాస్తు సమర్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.జ్యోతికృష్ణ, తాసిల్దార్ నాగరాజు, డిప్యూటీ తాసిల్దారులు యస్.వివి సత్యనారాయణ, శివ,రామకృష్ణ, చైతన్య, విశ్వనాథం, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్ర రావు, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, పాలుబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఇన్‌చార్జ్ ప్రమేయం లేకుండా నూతన కమిటీలను ప్రకటించే అధికారం ఎవరిచ్చారు?

తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర-చింతపల్లి : తెదేపా పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రమేయం లేకుండా ఆ పార్టీలో పాత కమిటీలను రద్దుచేసి నూతన కమిటీలను ఏర్పాటు చేసే హక్కు సభ్యత్వాలు లేని నాయకులకు ఎవరిచ్చారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. గడచిన ఐదేళ్లుగా అధికార వైకాపా ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఆ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ మన్య ప్రాంతంలో తెదేపాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేసిన పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి తో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జి లు, కుటుంబ సాధికార సారథులకు, ఓటర్లకు పరిచయమే లేని వ్యక్తిని పాడేరు నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా ప్రకటించిన అధిష్టాన నిర్ణయాన్ని నిరసిస్తున్న పార్టీ కుటుంబ సభ్యుల అభిప్రాయాలకు విరుద్ధంగా పాడేరు శాసనసభ అభ్యర్థిత్వం దక్కించుకున్న వ్యక్తితో పాటు కొందరు నాయకులు ప్రస్తుతం పాడేరు నియోజకవర్గంలో ఉన్న తెదేపా పాత మండల కమిటీ లను రద్దు చేయాలని, నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని ఒక దురభిప్రాయం తో ఉండడమే గాక ఈమధ్య నూతన కమిటీని ప్రకటించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్నికలు నోటిఫికేషన్ వెలువడిన ఈ సమయంలో ఏ పార్టీ కూడా ఇటువంటి చిల్లర పనులు చేయరని, రాజకీయ అవగాహన లేని వారే ఇటువంటి చర్యలు చేపడతారని భావిస్తున్నామన్నారు. అనివార్య కారణాల రీత్యా మార్పు చేయాలన్నా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అనుమతి ఉండాలని, ప్రస్తుతం పాడేరు నియోజకవర్గం తెదేపా ఇంచార్జ్ గా గిడ్డి ఈశ్వరి గారే కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఆమెతో సంప్రదింపులు జరపకుండా నూతన కమిటీని ఎలా ప్రకటించారనేది ప్రకటించిన వారే

సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే ఏదైతే నూతన కమిటీల నియామకాలకి తెరలేపారో వారు ప్రత్యర్థి పార్టీలతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని తెదేపా లో కమిటీల పేరిట చీలికలు తెచ్చి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే ఆలోచన చేస్తున్నారేమో అనే అనుమానం కలుగుతోందన్నారు. తెదేపా పాడేరు నియోజకవర్గం కుటుంబ సభ్యులందరూ ఈ పరిణామాలను గమనించాలన్నారు. గడచిన ఐదేళ్లుగా పార్టీ ని కాపాడిన మనల్ని ఈ రోజు క్రొత్త గా పార్టీ లో చేరిన వ్యక్తులు బెదిరించటం అనేది చాలా దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నానన్నారు. ఇన్చార్జిగా ఉన్న గిడ్డి ఈశ్వరిని అదిష్టానం పిలిచి మాట్లాడే వరకూ సామంతా గిడ్డి ఈశ్వరి వెంటే నడుస్తామని, పార్టీ శ్రేణులతో పాటు నాయకులు కార్యకర్తలు ఓటర్లను ఆమె వెంటే నడిపిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. కార్యకర్తలను ఓటర్లును నడిపిస్తాము. ఇందులో ఎటువంటి మార్పు ఉండదని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

అలజంగి జోగారావు గడప గడపకు ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మునిసిపల్ 20, 21వ వార్డులలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు గురువారం గడప గడపకు ఎన్నికల ప్రచారన్ని నిర్వహించి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వ్వే జగన్ ను గెలిపించాలని అందరినీ అభ్యర్థించం జరిగినది. ఈ కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవి కుమార్, స్థానిక వైసిపి కన్వీనర్లు సామల లలితకుమారి, చందాన ఆనంద్, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ పి. వైడిరాజు ఆధ్వర్యంలో గురువారం పార్వతీపురం హెచ్పి గ్యాస్ గొడౌన్ వద్ద సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకములైన అగ్నిప్రమాదాలు సంభవించే వేళ తీసుకోవాల్సిన నివారణ చర్యలపై, గ్యాస్, ఎలక్ట్రికల్ వలన కలిగే అగ్నిప్రమాదాల గురించి అక్కడ ఉన్న వినియోగదారులకు, గ్యాస్ గొడౌన్ సిబ్బందికి అవగాహన కల్పించే విధంగా తన సిబ్బందితో ఫైర్ డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను, నివారణ చర్యలను ఫైర్ డెమో నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్పి గ్యాస్ డీలర్ పెంటపాటి సాయి కిరణ్ కుమార్, పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం ఎల్ఎఫ్ టి. ఉమామహేశ్వరరావు, అగ్నిమాపక సిబ్బంది, గ్యాస్ గొడౌన్ సిబ్బంది పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యంజిల్లా నియోజకవర్గాల వ్యయ పరిశీలకులుగా రమాకాంత్ ప్రధాన్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాల వ్యయ పరిశీల కులుగా రమాకాంత్ ప్రధాన్‌ను ఎన్నికల సంఘం నియమించింది. గురువారం ఆయన జిల్లాకు చేరుకున్నారు. ఉద్యానవన కళాశాల అతిథిగృహం రూం నెంబర్ 2లో బసచేస్తున్నారని, వ్యయ పరిశీలకుల ఫోన్ నంబరు 9346163053 కాగా వ్యయ పరిశీలకుల సమన్వయ అధికారిగా జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్ కృష్ణ (8179817653) వ్యవహరిస్తున్నారని తెలిపారు. వ్యయ సంబంధిత అంశాలపై సమాచారం, పిర్యాదులు సమర్పించవచ్చని కృష్ణ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు... కలెక్టర్ విజయ్ సునీత

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించటానికి అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు సుమారు 28,800 అధికంగా ఉన్నారని, మహిళలందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా ఎన్నికలలో ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోనేందుకు చర్యలు తీసుకున్నందున ఓటర్లందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికలలో సుమారు 61 వేల మంది అధిక ఓటర్లు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా గత జనవరి 22న తుది జాబితా ప్రకటించిన తరువాత సుమారు ఎనిమిది వేల ఓటర్లను ఫారం -6 ద్వారా నమోదు చేయటం జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 14 వరకు అందిన ఫారం -6 లను పరిశీలించి అప్ డేట్ చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఓటింగ్ ఉదయం 07.00 నుండి సాయంత్రం 04.00 గంటల వరకు మాత్రమె జరపడానికి ఎన్నికల కమిషన్ సూచించిందని చెప్పారు. ఎన్నికల సంఘం అనుమతితో జిల్లాలో 30 పోలింగ్ కేంద్రాల పేరు, లొకేషన్ మార్పు చేయటం జరిగిందన్నారు. వై. రామవరం మండలం లో ఆరు పోలింగ్ కేంద్రాల నుండి పోలింగ్ అనంతరం మెటీరియల్ ను హెలికాప్టర్ ద్వారా రిసెప్షన్ కేంద్రానికి తరలించే చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 2,689 మంది పిఒ, ఎపిఒలకు, శిక్షణ పూర్తి చేయడం జరిగిందని, 5,116 ఒపిఒలకు శిక్షణ ఇస్తామని అందులో అనివార్య కారణాల వల్ల హాజరు కానివారికి ఆన్లైన్ శిక్షణ ఇస్తామని స్పష్టం చేసారు. ఇవిఎంల మొదటి దశ ర్యేండమైజేషన్ పూర్తిచేసి ఆయా నియోజకవర్గాలకు పంపించి తగు భద్రతా చర్యలు కల్పించడం జరిగిందని, రెండవ ర్యేండమైజేషన్ ఎన్నికల ముందురోజు ఆయా నియోజక వర్గాల పరిధిలో నిర్వహించి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పంపించటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాకు ముగ్గురు పరిశీలకులను నియమించా రని, సాధారణ పరిశీలకులుగా కె. వివేకానంద, వ్యయ పరిశీలకులుగా పంకజ్ సింగ్, పోలీస్ పరిశీలకులుగా నయీం ముస్తఫా మన్సూరి నియమితులయ్యారని తెలిపారు. వారంతా త్వరలో జిల్లాకు చేరుకుంటారని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, సువిధ యాప్ ద్వారా నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని, ఐతే దానిని డౌన్ లోడ్ చేసి ఫిజికల్ ప్రతి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది స్పష్టం చేసారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉల్లంఘనలతో నలుగురు వాలంటీర్లను, ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని విధులనుండి తొలగించటం జరిగిందని, 526 మంది వాలంటీర్లు రాజీనామాలు సమర్పించారని తెలిపారు. సి.విజిల్ ద్వారా 25 ఫిర్యాదులు అందాయని వాటిని వెంటనే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. 85 ఏళ్ళ పైబడిన వారు, విభిన్న పతిభావంతులు ఇంటినుండే ఓటు వేయటానికి మే నెల 02 నుండి 10 మధ్య తేదీలలో కార్యాచరణ రూపొందిస్తామని, పోస్టల్ బ్యాలెట్ వేసే వారికి మే 05, 06 తేదీలలో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైనందున ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత రెండు నెలల నుండి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎటువంటి అనుకోని సంఘటనలు జరగలేదని అందుకు కారణం ప్రజలకు నక్సలైట్ల ఆలోచనా విధానాలు నచ్చకపోవటం, సుమారు 120 మంది లొంగి పోవటం, లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించడం, రహదారి సౌకర్యాలు పెరగటం, తదితర కారణాల వల్ల ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించగలరని తెలిపారు. అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసామని, తొమ్మిది ఎస్ ఎస్ టి బృందాలు విధులు నిర్వహిస్తారని, 17 ఎఫ్.ఎస్.టి బృందాలు ఏర్పాటు చేసామని, ప్రతి పోలీస్ స్టేషన్ లో ఎంసిసి బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల బందోబస్తుకు గ్రేహౌండ్స్, ఆర్మ్డ్ ఫోర్స్, సిఆర్ పి ఎఫ్, ఎపిఎస్పి, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రోడ్ ఓపెన్ పార్టీలు, సివిల్ పోలీస్ బృందాలను వినియోగిస్తామని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో ఉన్న కంట్రోల్ రూమ్ లతో పాటు సబ్ డివిజన్ స్థాయిలో నాలుగు, జిల్లా స్థాయిలో ఒకటి కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా చేపడుతున్నట్లు ఎస్పీ వివరించారు.

గర్భిణీల నమోదు త్వరితగతిన జరగాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగన్నాథరావు

విశాలాంధ్ర-బెలగాం : గర్భిణీల నమోదు త్వరితగతిన జరగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు ఆదేశించారు. పార్వతీపురం, గరుగుబిల్లి మండలాలకు చెందిన పిహెచ్సిల వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని స్థానిక ఎన్జీఓ భవనంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణీకి పూర్తి స్థాయిలో, ఖచ్చితమైన వైద్య సేవలందాలంటే క్షేత్ర స్థాయిలో ఈసి (అర్హులైన జంట)లను గుర్తించి, సకాలంలో గర్భనిర్ధారణ పరీక్షలు జరిపి, గర్భిణీల నమోదు (రిజిస్ట్రేషన్) త్వరగా అనగా మొదటి త్రైమాసంలోనే చేయాలని, అందుకు అవసరమైన పూర్తి వివరాలు మాతాశిశు సంరక్షణ కార్డులో పొందుపర్చాలన్నారు. తద్వారా ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు గర్భిణికి త్వరగా నిర్వహించి ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే సత్వరమే గుర్తించవచ్చని, సరైన చికిత్స, పర్యవేక్షణ చేయడం ద్వారా హైరిస్క్ ఆరోగ్య సమస్యలకు గురికాకుండా జాగ్రత్త పడవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా హీమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రతీ రోజూ ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు వేసుకునే విధంగా పర్యవేక్షణ చేయాలని, అవసరమైన ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రంలో గర్భిణికి అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలియజేసారు. ప్రిజం10 అమలు తీరును పర్యవేక్షించాలని వైద్యాధికారులకు సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారలోపం, శ్వాస సంబంధమైన సమస్యలున్న వారిని త్వరగా గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని, సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలన్నారు. గ్రామాల్లో ఫీవర్ సర్వలెన్స్ పై దృష్టిసారించి అవసరమైన వారికి జ్వర నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. వడదెబ్బ, వేసవి జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్య పర్యవేక్షణ చాలా అవశ్యకమన్నారు. ఎన్సిడి, ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ఆరోగ్య కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ముఖ్యంగా మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ నారాయణరావు, డిఎంఓ డాక్టర్ టి. జగన్ మోహనరావు, ఆర్బిఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్. రఘుకుమార్, ఎన్డిపి ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంతిని. వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి, డిపిఓ లీలారాణి, ఎస్ఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో రౌడీయిజాన్ని పెంచి పోషిస్తున్న వైసిపి : ఎన్డీఏ కూటమి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : మండలంలో బుధవారం బిజెపి ఎన్ డి ఏ కూటమి ప్రచారంలో పాల్గొన్న కూటమి కార్యకర్తలైన కోట్ల నాగేశ్వరావు పై వైసిపి కి చెందిన గుండాలు దాడి చేయడాన్ని మండలఎన్డీఏ కూటమి నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలో అనంత బాబు ప్రోత్సాహంతో వైసీపీ నాయకులు రౌడీయిజం చేస్తున్నారని పోలీసులు అధికార పార్టీకి ఒకరకంగా ప్రతి పక్షాలకు ఒకరకంగా చేయటం వలనే ఇటువంటి దాడులు పెరిగాయని ఏజెన్సీలో గంజాయిని అక్రమ మద్యాన్ని వైసిపి నాయకులు పెంచి పోషించడం వల్ల ఈ దాడులు పెరిగాయి అన్నారు. ఎన్నికలు పోలింగ్ రోజున వైసిపి నాయకులు ఆగడాలు మితిమీరు కుండా కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు వడ్డీ గూడెం లో జరిగిన దాడికి కారకులైన వారిని పోలీస్ వారు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆచంట శ్రీనివాసరావు ముత్యాల రామారావు ప్రధాన కార్యదర్శి బుర్కా కన్నారావు బిజెపి మండల అధ్యక్షుడు ముత్యాల రాంబాబు ప్రధాన కార్యదర్శిఉవిక రత్తయ్య, స్టేట్ ఎస్టి మోర్చా మెంబరు సోడి భానుచందర్ సోషల్ మీడియా కడుపు రాజు జనసేన మండల అధ్యక్షుడు ములకల సాయి కృష్ణ మండల కార్యదర్శి బాగు ల అంజనరావు, యూత్ నాయకులు ముంజుపు సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పార్టీకి జెడ్పిటిసీ రాజీనామా

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మండల జెడ్పిటీసీ వడుగుల జ్యోతి గురువారం వైసిపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు, పాత్రికేయులతో మాట్లాడుతూ పార్టీకోసం 14 సంవత్సరాలుగా పని చేస్తున్నానని, జెడ్పిటీసీ స్థాయిలో ఉన్నా నాకు పార్టీలో సముచిత స్థానం లేదని ఎటువంటి పార్టీ కార్యక్రమాలకు తనను పిలటం లేదని అమెతెలిపారు, ఆమె వెంట మండల వ్యవసాయశాఖ అధ్యక్షుడు చీడిపల్లి అప్పారావు, మండల యువజన అధ్యక్షుడు అంకం రవి వైసీపీ పార్టీకి,సభ్యత్వానికి రాజీనామా చేశారు.

ధోనుబాయి వైద్యాధికారిపై విచారణ

విశాలాంధ్ర-సీతంపేట: మండలం దోనుభాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న భానుప్రతాప్‌పై దోనుబాయి ఆరోగ్య కేంద్రం సిబ్బంది కొద్దిరోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఇచ్చినపిర్యాదు పై దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచారణ చేయడానికి గురువారం వచ్చిన జిల్లా అధికారులు. దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు పార్వతీపురం డిప్యూటీ డిఎం & హెచ్వో శివకుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. వైద్యాధికారి భాను ప్రతాప్‌పై వచ్చిన పిర్యాదుపై క్షుణ్ణంగా ఆరోగ్య కేంద్ర సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు వైద్యాధికారి భానుప్రతాప్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసిన తదుపరి నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తానన్న డిప్యూటీ డియం & హెచ్వో శివకుమార్ తెలిపారు.